షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152


# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 24 జనవరి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-

## రెండు రాష్ట్రాల మధ్య
# మళ్లీ జగడం



- తెలుగు రాష్ట్రాల మధ్య నీళ్ల పంచాయతీపై సుప్రీంకోర్టుకు ఏపీ ప్రభుత్వం
- తెలుగు రాష్ట్రాల మధ్య కేంద్రం పెద్దన్న పాత్రను పోషిస్తోంది
- కృష్ణా ట్రిబ్యునల్‌పై సుప్రీంకోర్టులో ఫిబ్రవరి 13న విచారణ జరగనుంది.
- 2023 అక్టోబర్ 23వ తేదీన విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌పై బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది.



## రాహుల్ గాంధీకి అస్వస్థత

- నేడు ఢిల్లీ ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకున్న రాహుల్
- వైద్యుల సూచన మేరకు ప్రచారాన్ని రద్దు చేసుకున్నారన్న ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్
- రేపు ఎన్నికల ర్యాలీలో పాల్గొంటారని వెల్లడి



## కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాల్సిందే

- సీఎం రేవంత్‌కు ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ
- బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఇంకెంత కాలయాపన చేస్తారని ప్రశ్న
- రిజర్వేషన్లను పెంచుతామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా హామీ ఇచ్చిందన్న కవిత
- రాష్ట్ర ప్రభుత్వం వైఖరితో బీసీలకు అన్యాయం జరుగుతోందన్న ఎమ్మెల్సీ

హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఇంకెంత కాలం తాత్సారం చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కులగణన పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి ఏడాది - మిగతా3లో


## తెలంగాణ రైజింగ్
# పెట్టుబడుల వర్షం



- రాష్ట్రం ఏర్పడ్డాక ఇంత భారీగా పెట్టుబడులు రావడం ఇదే తొలిసారి కావడం విశేషం.
- 10 సంస్థలతో ఒప్పందాలు చేసుకోగా, గత ఏడాదితో పోలిస్తే మూడింతలు మించిన పెట్టుబడులు
- తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం
- ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సు వేదికగా రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం
- రూ.45,500 కోట్ల పెట్టుబడులకు సన్ పెట్రో కెమికల్స్ ఎంవోయూ
- ముగిసిన సీఎం రేవంత్ రెడ్డి నాలుగు రోజుల దావోస్ పర్యటన

హైదరాబాద్

దావోస్‌లో తెలంగాణ సత్తా చాటారు సీఎం రేవంత్ రెడ్డి. రాష్ట్రం ఏర్పడ్డాక ఇంత భారీగా పెట్టుబడులు రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. రైజింగ్ తెలంగాణ బృందంతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి దావోస్ వెళ్లిన విషయం అందరికీ తెలిసిందే. ఈ పర్యటనలో 10 సంస్థలతో ఒప్పందాలు చేసుకోగా, గత ఏడాదితో పోలిస్తే మూడింతలు మించిన పెట్టుబడులు రావడం ఆనందంగా ఉందని కాంగ్రెస్ నాయకులు తెలుపుతున్నారు. అది కూడ ఇప్పటివరకు రూ. 1.32 లక్షల కోట్ల పెట్టుబడులు వెల్లువలా రాగా, కొత్త ఒప్పందాలతో 46 వేల మందికి ఉద్యోగ - మిగతా3లో



## కుంభమేళాలో 10 కోట్లకు పైగా
## భక్తుల పుణ్యస్నానాలు

- నేడు.. మధ్యాహ్నం వరకు 30 లక్షల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు వెల్లడి
- మకర సంక్రాంతి రోజున 3.5 కోట్ల భక్తుల పుణ్యస్నాలు
- కుంభమేళాకు 45 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా

## మంచి చేయాలని చూస్తుంటే
# అడ్డుకుంటున్నారు

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేని సిగ్గులేని నేతలు గ్రామసభలకు అడ్డుతగులుతున్నారు
- దీక్షలు, నిరసనల పేరుతో అడుగడుగునా అడ్డం పడుతున్నారు
- రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మంత్రులుగా తమ జోక్యం ఉండదు
- న్యాయంగా అర్హులైన వారందరికీ మంజూరు చేస్తారు

యాదాద్రి

తెలంగాణ రాష్ట్రంలో అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని చూస్తుంటే బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకుంటున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేని సిగ్గులేని నేతలు గ్రామసభలకు అడ్డుతగులుతున్నారని మంత్రి ఘాటుగా స్పందించారు. దీక్షలు, నిరసనల పేరుతో అడుగడుగునా అడ్డం పడుతున్నారని తుమ్మల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పదేళ్ల విధ్వంస పాలనకు గురైన రాష్ట్రాన్ని ఆదు కునేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. అందుకే తెలంగాణ రైతాంగాన్ని ఆదుకునేందుకు - మిగతా3లో



## లంచాలకు కేరాఫ్ అడ్రస్ దుండిగల్ మున్సిపాలిటీ కమీషనర్ చైన్ మెన్ లు

**కలెక్షన్ కింగ్ లు చైన్ మెన్ లే నా**

**దుండిగల్ లో కలెక్షన్ల దుమ్ము లేపుతున్న చైన్ మెన్ లు**

**కమిషనర్ కను సన్నల్లోనే ఇదంతా నా**





**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి జనవరి 23**
దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న చైన్ మెన్ లు మున్సిపాలిటీ పనులను పక్కనపెట్టి మనీ మెయిన్ లా పనిచేస్తున్నారని ప్రజల్లో వినిపిస్తున్నాయి. భారీ అక్రమ షెడ్లు నిర్మాణాలు పెద్ద ఎత్తున అక్రమ బహుళ అంతస్తు నిర్మాణాల వద్ద అడ్డగోలుగా పైసలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ విధులు నిర్వహిస్తే తమకేమొస్తుంది అనుకున్నారేమో గాని ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకొని ప్రతి నెల లక్షల్లో అక్రమ సంపాదన అర్జిస్తున్నట్లు ప్రజల్లో పుకార్లు వినిపిస్తున్నాయి. మునుపెన్నడు లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతారహితంగా డబ్బులే ముఖ్యమైనట్లు వ్యవహరించడం మరింత వ్యతిరేకతకు ఆజ్యం పోస్తుందని ప్రజలలో వినికిడి.



కమిషనర్ ప్రమేయం లేకుండా చైన్ మెన్ లు ఈ పనులు చేయగలరా దుండిగల్ మున్సిపాలిటీ కమిషనర్ గా కల్వకుంట్ల సత్యనారాయణ వచ్చినప్పటి నుండి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి బహుళ అంతస్తులు నిర్మాణాలు నిర్మించే కంపెనీలు తప్పనిసరిగా కల్వకుంట్ల సత్యనారాయణ ను కలిసి ముడుపులు ఇచ్చుకోవాల్సి దేనని పలువురు పేర్కొంటున్నారు. మున్సిపల్ కమిషనర్ కను సైగల్లోనే మున్సిపాలిటీలో ఉండే అన్ని శాఖల అధికారులు పని చేస్తారనే విషయం స్పష్టం అవుతుంది. కమిషనర్ పేరు వాడుకుంటూ చైన్ మెన్ లు అడ్డం పెట్టుకొని వసూళ్లు చేస్తున్నట్లు వెలుగులోకి వస్తున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కేవలం నామ మాత్రమేనని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ఫిర్యాదులు వస్తున్నాయంటూ బెదిరింపులు**
దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల దగ్గర పెద్ద ఎత్తున టౌన్ ప్లానింగ్ చైన్ మెన్ లు హడావిడి లు చేస్తున్నట్టు స్పష్టం అవుతుంది. అక్రమ నిర్మాణాలను అరికట్టాలని అధికారులకు ఫిర్యాదులు అందగా వాటిని అదునుగా తీసుకొని నిర్మాణ దారులను సంప్రదించి మీ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని భయభ్రాంతులకు గురిచేసి పెద్ద ఎత్తున వారి వద్ద నుండి డబ్బులు లాగుతున్నట్లు తెలుస్తుంది. అయితే వీటి వెనుక టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా చైన్ మెన్ ల ఆగడాలను అరికట్టే విధంగా కమిషనర్ చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో ప్రజలు ఆగ్రహానికి గురయ్యే అవకాశం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

**అక్రమ నిర్మాణాలపై టిపివో సంజన వివరణ**
టి పి ఓ సంజన అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకుంటామని కూల్చివేత లకు వాహనం కూడా ఏర్పాటు అయ్యిందని త్వరలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# తెలంగాణ రైజింగ్....
# పెట్టుబడుల వర్షం

-మొదటిపేజీ తరువాయి

అవకాశాలు దక్కనున్నాయి. పెట్టుబడుల సాధనే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి దావోస్ లో పర్యటిస్తున్నారు. అయితే ఇక్కడ పెట్టుబడుల సమీకరణలో తెలంగాణ సరికొత్త రికార్డులు నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర చరిత్రలో భారీ పెట్టుబడుల రికార్డు నమోదు చేసింది. దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో ఇప్పటికే రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణ సాధించింది. గత ఏడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అప్పటితో పోలిస్తే ఈసారి మూడింతలకు మించిన పెట్టుబడులు రావటం విశేషం. దావోస్ వేదికపై ఈసారి తెలంగాణ రాష్ట్రం అందరి దృష్టిని ఆకర్షించింది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలో తెలంగాణ రైజింగ్ బృందం దావోస్ లో వివిధ పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశాలన్నీ విజయవంతమయ్యాయిహైదరాబాద్లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతమివ్వటం ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలను అమితంగా ఆకట్టుకుంది. దీంతో పాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మెట్రో విస్తరణకు ప్రభుత్వం ఎంచుకున్న భవిష్యత్తు ప్రణాళికలు పెట్టుబడుల వెల్లువకు దోహదపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న తెలంగాణ రైజింగ్ 2050 విజన్ గేమ్ ఛేంజర్ గా నిలిచింది. అన్ని రంగాలకు అనుకూలమైన వాతావరణమున్న హైదరాబాద్ గ్రేటర్ సిటీ పెట్టుబడుల గమ్యస్థానంగా మరోసారి ప్రపంచానికి చాటి చెప్పినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సరళతర పారిశ్రామిక విధానంతో పాటు ఇటీవల ప్రకటించిన క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ ప్రపంచ పారిశ్రామికవేత్తలను దృష్టిని ఆకర్షించింది. దేశ విదేశాలకు చెందిన పేరొందిన పది ప్రముఖ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఐటీ, ఏఐ, ఇంధన రంగాల్లో అంచనాలకు మించినట్లుగా భారీ పెట్టుబడులను సాధించింది. దావోస్ లో వరుసగా మూడు రోజుల పాటు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో దాదాపు 46 వేల మంది యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి.

**ఒప్పందాలు ఇవే..**

యూనిలీవర్ సంస్థ కామారెడ్డిలో పామాయిల్ కేంద్రం ఏర్పాటు స్కైర్ రూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ రాకెట్ తయారీ సంస్థ 500 కోట్లు పెట్టుబడి ? 11 వేల కోట్ల పెట్టుబడుల తో మెగా సంస్థ 2160 మెగా వాట్లతో పంపు స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి కేంద్రం ద్వారా 1250 ఉద్యోగాలు ? 3000 కోట్లతో బ్యాటరీ ఎనర్జీ కేంద్రం 4000 ఉద్యోగాలు ? 1000 కోట్లతో పర్యావరణ రంగం లో పెట్టుబడి ? కంట్రోల్ ఎస్ సంస్థ ంఎ ఆధారిత డాట క్లస్టర్ హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటు ? ఎస్ సంస్థ పదివేల కోట్ల పెట్టుబడి 3600 మందికి ఉపాధి ? ఊఅఒ కొత్త టెక్ క్యాంపస్ ? హైదరాబాద్‌లో విప్రో విస్తరణ ? గోపనపల్లి క్యాంపస్ లో కొత్త ఐటీ సెంటర్ ? 5000 మంది ప్రత్యక్షంగా పరోక్షంగా ఉద్యోగాలు ? రూ.800 కోట్లతో అన్‌మాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన జేఎస్ డబ్ల్యూ ? రూ.45500 కోట్లతో రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజీ, సోలార్ పవర్ ప్రాజెక్టులు మూడు చోట్ల నెలకొల్పనున్న సన్ పెట్రో కెమికల్స్ పెట్టుబడులకు



ఒప్పందం.. 7000 ఉద్యోగాలు ? గోపనపల్లి లో విప్రో కొత్త క్యాంపస్ , ప్రత్యక్షంగా పరోక్షంగా 5000 మందికి ఉద్యోగ అవకాశాలు ? పోచారంలో ఇన్ఫోసిస్ సేవలు విస్తరణ ? 17వేల మందికి ఉపాధి అవకాశాలు ? మొదటి దశగా 750 కోట్లు పెట్టుబడి

అమెజాన్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో 60 వేల కోట్ల పెట్టుబడులు

**హైదరాబాద్‌లో కొత్తగా 17 వేల ఐటీ ఉద్యోగాలు**

ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌ను విస్తరించనుంది. పోచారంలో ఉన్న ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో అదనంగా 17 వేల ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా అక్కడున్న సదుపాయాలు విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేష్ సంగ్రాజ్‌తో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. అనంతరం ప్రకటన విడుదల చేశారు.ఈ ఒప్పందంలో భాగంగా ఫస్ట్ ఫేజ్‌లో ఇన్ఫోసిస్ సంస్థ రూ.750 కోట్ల పెట్టుబడితో కొత్త ఐటీ భవనాల నిర్మాణం చేపడుతుంది. వచ్చే రెండు, మూడేళ్లలో ఈ నిర్మాణం పూర్తవుతుంది. ఈ కొత్త సెంటర్ రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న ఐటీ పర్యావరణ వ్యవస్థకు గణనీయంగా దోహదపడుతుంది. దేశంలో ప్రముఖ ఐటీ గమ్యస్థానంగా తెలంగాణ ప్రతిష్టను మరింత పెంచుతుంది. ఇప్పటికే ఇన్ఫోసిస్ హైదరాబాద్‌లో దాదాపు 35,000 మంది ఉద్యోగులున్నారు. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవటం కొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుతుందని, ఇప్పుడున్న ఐటీ సమూహాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉమ్మడి దృక్పథాన్ని ప్రతిబింబిస్తుందని జయేష్ సంగ్రాజ్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేసే లక్ష్యంతో అన్ని రంగాల్లో ప్రముఖ సంస్థలు, పారిశ్రామిక దిగ్గజాలకు ప్రభుత్వం తగినంత మద్దతు ఇస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారుఅటు, తెలంగాణలో భారీ పెట్టుబడికి దిగ్గజ సంస్థ అమెజాన్ ముందుకొచ్చింది. దావోస్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైకేల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. రూ.60 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అమెజాన్ అంగీకారం తెలిపింది. ఈ మేరకు ఒప్పందం రాష్ట్ర ప్రభుత్వంతో జరగ్గా.. రాష్ట్రంలో డేటా సెంటర్లను సంస్థ విస్తరించనుంది. వీటికి అవసరమైన భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందిదావోస్‌లో పెట్టుబడుల సమీకరణలో తెలంగాణ సరికొత్త రికార్డులు నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర చరిత్రలో భారీ పెట్టుబడుల రికార్డు నమోదు చేసింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో ఇప్పటికే రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించింది. గతేడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అప్పటితో పోలిస్తే ఈసారి మూడింతలకు మించిన పెట్టుబడులు రావటం విశేషం. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలో తెలంగాణ రైజింగ్ బృందం దావోస్‌లో వివిధ పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశాలన్నీ విజయవంతమయ్యాయి. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వటం ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలను అమితంగా ఆకట్టుకుంది. దీంతో పాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మెట్రో విస్తరణకు ప్రభుత్వం ఎంచుకున్న భవిష్యత్తు ప్రణాళికలు పెట్టుబడుల వెల్లువకు దోహదపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న తెలంగాణ రైజింగ్ 2050 విజన్ గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. అన్ని రంగాలకు అనుకూలమైన వాతావరణమున్న హైదరాబాద్ గ్రేటర్ సిటీ పెట్టుబడుల గమ్యస్థానంగా మరోసారి ప్రపంచానికి చాటిచెప్పినట్లయింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సరళతర పారిశ్రామిక విధానంతో పాటు ఇటీవల ప్రకటించిన క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ ప్రపంచ పారిశ్రామికవేత్తలను దృష్టిని ఆకర్షించింది. దేశ విదేశాలకు చెందిన పేరొందిన 10 ప్రముఖ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఐటీ, ఏఐ, ఇంధన రంగాల్లో అంచనాలకు మించినట్లుగా భారీ పెట్టుబడులను సాధించింది. దావోస్‌లో వరుసగా మూడు రోజుల పాటు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో దాదాపు 46 వేల మంది యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి.

దావోస్ లో తెలంగాణకు భారీగ పెట్టుబడులు

దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వేదికపై తెలంగాణ మరో కొత్త రికార్డు నమోదు చేసింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఒకే రోజు భారీ పెట్టుబడులను సమీకరించింది. ముఖ్యంగా 3 కంపెనీల ద్వారా రాష్ట్రానికి రూ.56,300 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా రాష్ట్ర యువతకు దాదాపు 10,800 ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. దేశంలో ఇంధన రంగంలో పేరొందిన సంస్థ 'సన్ పెట్రో కెమికల్స్' రాష్ట్రంలో రూ.45,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజీ, జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపై (ఎంవోయూ) సంతకం చేసింది. ఈ జిల్లాల్లో..నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో మూడు చోట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులను నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుల మొత్తం ఇంధన సామర్థ్యం 3,400 మెగావాట్లు. వీటికి 5,440 మెగావాట్ల సామర్థ్యముండే సోలార్ విద్యుత్తు ప్లాంట్లను అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణ దశలోనే దాదాపు 7000 ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటివరకు దావోస్ వేదికపై తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే. సన్ పెట్రో కెమికల్స్ ఎండీ దిలీప్ సాంఘ్వీతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి , పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈ ఒప్పందంపై కీలక చర్చలు జరిపారు.

# కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను
# అమలు చేయాల్సిందే

-మొదటిపేజీ తరువాయి

గడిచినా ఇంకా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ మేరకు గురువారం నాడు ఎమ్మెల్సీ కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బీసీలకు ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి 2024-25 బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేసి తొలి ఏడాదే కామారెడ్డి డిక్లరేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఉల్లంఘించారని విమర్శించారు. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల బీసీ వర్గాల్లో ఏ మాత్రం విశ్వాసం లేదని, ఈ వైఖరితో రాష్ట్రంలో బీసీలంతా తీరని అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

**డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన..**

"కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రధాన హామీ అయిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం. "కుల గణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే బీసీలకు రిజర్వేషన్ల పెంపు" అని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో స్పష్టంగా పేర్కొని ఉంది. 6 నెలలు గడిచాయి%ా% ఏడాది గడిచింది.. అయినా కూడా రిజర్వేషన్ల పెంపునకు అతీగతీ లేదు. అశాస్త్రీయంగా బీసీ గణన నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన చేయడమే మీ ఆలోచనగా కనిపిస్తోంది." అని తెలిపారు.

**బీసీలంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు చులకన..?**

కులగణన పూర్తయ్యి కూడా చాలా కాలం అవుతుందని, కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ వివరాలను బహిర్గతం చేయలేదని ఎండగట్టారు. ఆ వివరాలను తక్షణమే బహిర్గతం చేయాల్సిన



అవసరం ఉందని, డెడికేటెడ్ కమిషన్ నివేదిక సిద్ధమైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. " బీసీల అంశాల పట్ల మీ ప్రభుత్వం ఎందుకు అంత నిర్లక్ష్యం వహిస్తోంది ? బీసీలంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు చులకన ? 6 నెలల్లోపే అమలు చేస్తామన్న హామీ 12 నెలలు గడిచినా ఎందుకు అమలు చేయడం లేదు ? హామీని అమలు చేయడానికి ఇంకెంత కాలం పడుతుంది..?" అని ప్రశ్నల వర్షం కురిపించారు.

**ప్రజా పాలన కాకుండా ప్రత్యేకాధికారుల పాలన..**

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసి దాదాపు ఏడాది పూర్తయ్యిందని, మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం కూడా ముగిసిందని, ప్రస్తుతం గ్రామాల్లో ప్రజా పాలన కాకుండా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోందని వివరించారు. కానీ మీ ప్రభుత్వానికి త్వరగా రిజర్వేషన్లను పెంచి ఎన్నికలను నిర్వహించాలన్న సోయిలేనట్లు అర్థమవుతోందని అనుమానం వ్యక్తం చేశారు.

**రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిందే..**

బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిందేనని తేల్చిచెప్పారు. కుంటిసాకులు చెప్పి ఇచ్చిన మాట కంటే తక్కువ రిజర్వేషన్లు కల్పిస్తే మాత్రం తెలంగాణ సమాజం మిమ్మల్ని సహించబోదని, బీసీల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మీ మెడలు వంచి హామీని అమలు చేయించుకుంటామని హెచ్చరించారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను తక్షణమే 42 శాతానికి పెంచడానికి చర్యలను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రికి ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి చేశారు.

## మంచి చేయాలని చూస్తుంటే అడ్డుకుంటున్నారు

-మొదటిపేజీ తరువాయి



రుణమాఫీ చేసినట్లు చెప్పుకొచ్చారు.

**ఎందుకు చేయలేదు..**

అన్నదాతలకు మేలు చేస్తుంటే నల్లగొండలో రైతు దీక్ష చేస్తున్నారంటూ మంత్రి తుమ్మల నిప్పులు చెరిగారు. నల్లగొండ రైతు దీక్ష చేయాలని భావిస్తున్న బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు అధికారంలో ఉండి రైతులకు రుణమాఫీ ఎందుకు చేయలేదని మంత్రి నిలదీశారు. జనవరి 26 నుంచి అన్నదాతలకు రైతు భరోసా ఇవ్వనున్నట్లు మంత్రి తుమ్మల మరోసారి గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డును తాకట్టుపెట్టి కొంతమంది రైతులకు రైతు బంధు వేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో దొడ్డు బియ్యం మాఫియా ఉందని, అందుకే ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తీసుకువస్తారని మంత్రి తుమ్మల ధీమా వ్యక్తం చేశారు.

**మంత్రుల జోక్యం ఉండదు..**

రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మంత్రులుగా తమ జోక్యం ఉండదని, న్యాయంగా అర్హులైన వారందరికీ మంజూరు చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అధికారులు ప్రజాపాలన సభల్లో ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులను గుర్తిస్తారని మంత్రి తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ 15వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం జరిగేలా సాఫ్‌వేర్ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.2 లక్షలకు పైగా ఇంకా రుణమాఫీ కాని రైతులకు మార్చి నెలలో షెడ్యూల్ పెట్టి రుణమాఫీ చేస్తామని చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని, ముందు సమస్యలను అధికారులు, తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజా సమస్యలు పరిష్కరించడం తన బాధ్యతంటూ మంత్రి పొన్నం చెప్పారు.

## ఆ ముగ్గురిలో ఎవరు?


-మొదటిపేజీ తరువాయి


ప్లస్ పాయింట్స్ గా చెబుతున్నారు.. అయితే.. ముగ్గురిలో రేసులో ఈటల రాజేందర్ ముందున్నట్లు చెబుతున్నారు. తెలంగాణలో బీసీ నినాదం వినిపించేందుకు ఈటల ఆప్షన్ అని.. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఈటలకు ప్లస్ పాయింట్ అవుతుందని చెబుతున్నారు. అయితే.. షార్ట్ లిస్ట్ లో ఉన్న పేర్లను పరిశీలించిన తర్వాత త్వరలోనే కొత్త అధ్యక్షుడిని మోదీ, అమిత్ షా ఫైనల్ చేయనున్నట్లు చెబుతున్నారు.ప్రస్తుతం తెలంగాణ అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డి ప్లేస్‌లో గతకొన్ని రోజులుగా చాలా పేర్లే వినిపించాయి. ఈటలతో పాటు ధర్మపురి అర్వింద్, రఘునందన్‌రావు పేర్లు తెరపైకి వచ్చాయి. కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా ఉంటారనే ప్రచారం కూడా జరిగింది. ఐతే అన్నీ తోసిపుచ్చుతూ.. ఇప్పుడు 3 పేర్లను షార్ట్‌లిస్ట్ చేసినట్టు తెలుస్తోంది. ఈటల, డీకే అరుణ, రామచంద్రరావు.. ఈ ముగ్గురిలో ఒకరు అధ్యక్ష బాధ్యతలు చేపట్టే ఛాన్స్ ఎక్కువగా కనిపిస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి..తెలంగాణ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్ష పదవిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉండాలన్న నిబంధనేది లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్‌ను రాష్ట్ర నేతల ఏకాభిప్రాయంతో సెలెక్ట్ చేస్తారని, వారం రోజుల తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఎన్నిక ఉంటుందని కిషన్ రెడ్డి అన్నారు. ఈటల రాజేందర్ కూడా బీజేపీ అధ్యక్ష రేసులో ఉంటారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో తర్వాత ప్రెసిడెంట్ ఎవరో తెలిసిపోయిందని, బీఆర్ఎస్ అనేది ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అని, బీజేపీలో వచ్చే అధ్యక్షుడు ఎవరో ఎవరూ చెప్పలేరని కిషన్ రెడ్డి అన్నారు. కొత్త సభ్యత్వాలు,పోలింగ్ బూత్ కమిటీలు,మండల కమిటీలు పూర్తయ్యాయని జిల్లా కమిటీల ఎన్నిక ప్రక్రియ నడుస్తోందని తెలిపారు. 600 మండల కమిటీలు పూర్తి చేస్తే..అందులో 50 శాతంపైగా బీసీలకే అధ్యక్ష బాధ్యతలు ఇచ్చామని తెలిపారు.పార్టీలో మహిళలకు 33 శాతం పదవులు ఇస్తామని స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని అన్నారు. తెలంగాణలో ఎవరితో పొత్తు ఉండదని, బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఉచితాలు వద్దని బీజేపీ ఎక్కడా చెప్పలేదని, రాష్ట్ర ఆదాయ వనరులను చూసుకుని ఎన్నికల హామీలు ఇ?వవాలని ఆయన అన్నారు.

## భార్యను చంపి... కుక్కర్‌లో ఉడికించి... పొడి చేసి...
## అనుమానమే... పెనుభూతమై

**హైదరాబాద్ :** తెలంగాణలో దారుణం చోటుచేసుకుంది. భార్యను చంపి మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా చేసి కుక్కర్ లో ఉడికించిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. రంగారెడ్డి జిల్లా మీర్ పేట్ లో ఈ దారుణం జరిగింది. ఈ నెల 18న తన భార్య వెంకట మాధవి కనిపించడం లేదని భర్త గురుమూర్తి...భార్య తల్లిదండ్రులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో పోలీసులకు షాకింగ్ విషయాలు తెలిశాయి. భార్యాభర్తలు గురుమూర్తి, వెంకట మాధవి మధ్య గత కొన్ని రోజులుగా మనస్పర్థలు ఉన్నాయని, తరచూ గొడవపడుతుండేవారని పోలీసులకు తెలిపింది. భార్యను చంపిన గురుమూర్తి.. ఆ తర్వాత తనకేం తెలియనట్టు వ్యవహరించాడు. ఎవరికీ అనుమానం రాకుండా అమాయక చక్రవర్తిలా నటించాడు. అయితే రోజులు గడిచినా మాధవి నుంచి ఎలాంటి ఫోన్‌కాల్ రాకపోవడంతో కన్నవాళ్లకు అనుమానం వచ్చింది. తమ బిడ్డ కనిపించడం లేదంటూ ఈనెల 13న మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారుదీంతో భర్త గురుమూర్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో గురుమూర్తి అసలు విషయం చెప్పాడు.తన భార్యను తానే హత్య చేశానని గురుమూర్తి ఒప్పుకున్నాడు. భార్య మృతదేహాన్ని ముక్క ముక్కలుగా చేసి కుక్కర్ ఉడికించానని చెప్పాడు. అనంతరం ఆ ముక్కలను జిల్లెలగూడ చెరువులో పడేసినట్టు చెప్పాడు. గురుమూర్తి చెప్పిన విషయాలపై పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహం ఆనవాళ్ల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. గురుమూర్తి గతంలో ఆర్మీలో పనిచేసి రిటైరైనట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం కంచన్‌బాగ్‌లో సెక్యూరిటీ గార్డ్ గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. తూప్రాన్‌పేట్‌లోని దండుపల్లిలో గురుమూర్తి కుటుంబంతో నివశిస్తు?న్నాడు. వెంకట మాధవి మిస్సింగ్ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.ప్రకాశం జిల్లా జేపీ చెరువుకు చెందిన గురుమూర్తి వృత్తి రీత్యా డీఆర్డీవో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తూ.. జిల్లెల్లగూడలోని న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీలో భార్య వెంకట మాధవి(35)తో కలిసి జీవిస్తున్నాడు. వీరి సంసారంలో అనుమానం తలెత్తింది. దీంతో గురుమూర్తి తన భార్య వెంకట మాధవిని అనుమానించేవాడు. ఈ విషయమై ఇరువురి మధ్య పెద్ద ఎత్తున ఘర్షణ చెలరేగింది. దీంతో ఆగ్రహానికి లోనైనా గురుమూర్తి భార్యను అత్యంత దారుణంగా హత్య చేశాడు. అనంతరం భార్య మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా కోశాడు. కమర్షియల్ సిలిండర్ తెచ్చి ముక్కలను ఉడకబెట్టాడు. అనంతరం కొన్ని ముక్కలను ఎండబెట్టి పొడిగా మార్చాడు. భార్యను చంపడానికి ముందు ట్రయల్ కోసం ఓ కుక్కను చంపి ముక్కలుగా నరికి ఉడకబెట్టాడు. ఇదే విషయాన్ని విచారణలో అంగీకరించాడన్నారు పోలీసులు.గురుమూర్తి శాడిజం కన్నబిడ్డలతో పాటు బంధువుల్ని నివ్వెరపోయేలా చేసింది. కేవలం అనుమానంతోనే భార్యను కడతేర్చాడా? ఇంకేవైనా కారణాలు ఉన్నాయా? మర్డర్ ఎపిసోడ్‌లో గురుమూర్తికి ఎవరైనా సహకరించారా అన్న కోణంలో పోలీసులు ఆరాతీస్తున్నారుమృతదేహం పొడిని బకెట్‌లో తీసుకువెళ్లి జిల్లెలగూడ చెరువులో కలిపేశాడు.వెంకట మాధవి మృతదేహానికి సంబంధించి ఆనవాళ్ల కోసం పోలీసులు చెరువులో గాలిస్తున్నారు. బుదిద కావడంతో ఎలాంటి ఆనవాళ్లు దొరకడంలేదని తెలుస్తోంది. ఈ ఘటన నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది

# కాకతీయ కాలనీ ఫేస్ 2 లో నూతన సీసీ రోడ్డుకు శంకుస్థాపన





**- ముఖ్య అతిథులుగా మేయర్,డిప్యూటీ మేయర్ స్థానిక కార్పొరేటర్**

**షణ్ముఖ వెలుగు సిటీ ప్రతినిధి జనవరి 23:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెండవ డివిజన్ పరిధిలోని కాకతీయ కాలనీ ఫేస్ టు లో స్థానిక కార్పొరేటర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్ తో కలిసి మేయర్ అజయ్ యాదవ్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ లు సుమారు 67 లక్షలతో నూతన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కాకతీయ కాలనీ ఫేస్ 2కి నూతన సీసీ రోడ్డు వేస్తున్నందుకు స్థానిక కార్పొరేటర్ కొత్త లక్ష్మి రవి గౌడ్,మేయర్ అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ లను కాలనీ వాసులు శాలువాలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పోగుల నరసింహారెడ్డి, కొత్త చందర్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు రంగ బ్రాహ్మణ గౌడ్, కాలనీ అధ్యక్షులు కేదారి, గౌరవ అధ్యక్షులు బీతోజు భాస్కర్ చారి, ప్రధాన కార్యదర్శి రామ్ చరణ్, ఉపాధ్యక్షులు వెంకటేష్, కోశాధికారి సత్యనారాయణ, కమిటీ సభ్యులు భాస్కర్,గిరి, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, రంజిత్,ప్రవీణ్, విజయానంద్, కాలనీ మహిళలు అనురాధ, అంజమ్మ, అనూష తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు

# జాబితాల్లో పేర్లు లేని వారు ఎలాంటి ఆందోళన చెందవద్దు





**వారి నుండి మళ్లీ దరఖాస్తుల స్వీకరణ**

**పదేళ్లుగా రేషన్ కార్డులు, ఇండ్లు ఇవ్వని వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**షణ్ముఖ వెలుగు మేడిపల్లి మండలం ప్రతినిధి జనవరి 23** అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. భీమారం మండల కేంద్రంలో గురువారం జరిగిన ప్రజా పాలన గ్రామ సభకు ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన గ్రామ సభల్లో చదివిన జాబితాల్లో వివిధ పథకాల కింద పేర్లు రాని అర్హులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అధికారులు దరఖాస్తుల పై తక్షణమే విచారణ జరిపి వారిని ఎంపిక చేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్ స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గతంలో లాగ నాలుగు గోడల మధ్య లబ్ధిదారుల ఎంపిక చేయడం లేదని ప్రజల మధ్య వారి సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. గత పది సంవత్సరాలుగా ప్రజలు కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూసినా బిఆర్ఎస్ సర్కార్ ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందించిన పాపాన పోలేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు దశల వారిగా సంక్షేమ పథకాలను అమలు చేస్తు ముందుకు పోతున్నామని అన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 12 వేలు వారి ఖాతాల్లో జమ, పంటలకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పెంపు వంటి సంక్షేమ పథకాలను ఈనెల 26 నుండి అందించడం జరుగుతుందని చెప్పారు. పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని ఎన్ని సమస్యలు ఉన్నా వాటికి పరిష్కారం చేస్తూ ముందుకు పోతున్నామని అన్నారు.

ఇప్పటికే ప్రభుత్వం తరఫున ఆనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అడ తల్లులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షల పెంపు, 200 యూనిట్ల విద్యుత్,500 రూపాయలకు సిలెండర్ అందజేయడం జరుగుతుందన్నారు.. రైతులకు ఆనాడు ఉచిత కరెంటు అందించామని , రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేశామని పేర్కొన్నారు.. రైతులకు వరద కాలువ ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఏర్పాటు చేసిందని తెలిపారు.. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి ఇటీవల భీమారం మండల కేంద్రంలో 2 కోట్ల 20 లక్షలతో, పోరుమల్ల గ్రామంలో 2 కోట్ల 55 లక్షలతో 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయడం జరిగిందనీ అలాగే కాచారం గ్రామంలో ఉన్న సబ్ స్టేషన్ ను 132/33 కేవీ గా మార్చడానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు.. మేడిపల్లి మండల ప్రజల చిరకాల కోరిక జూనియర్ కళాశాల మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.. భీమారం మండలం ఆలాగే ఉంటుందని ఎలాంటి ఆందోళనలు చెందవద్దు అన్నారు.. వరద కాలువలో దమ్మున్న పేట ప్రాంతంలో క్రాస్ రెగ్యులేటర్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలను సిద్ధం చేశామని చందుర్తి మోత్కరావుపేట రోడ్డు నిర్మాణానికి గత పాలకులు అనుమతులు తీసుకురాలేక పోయారని నేను గెలిచిన సంవత్సరం లోపే రోడ్డు నిర్మాణానికి అనుమతులు తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు.. నిన్నటి రోజున మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ లు ఈ ప్రాంతానికి జీవాధారమైన కలికోట సూరమ్మ చెరువు పనులను పర్యవేక్షించడానికి వచ్చారని సమయా భావం వలన మంత్రులు రైతులకు ఎక్కువ సమయం కేటాయించ లేకపోయారని ఈ రోజూ ఉదయం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోన్ చేసి మళ్ళీ ప్రాజెక్టు పూర్తయ్యాక వస్తానని అప్పుడు రైతులతో ఎక్కువ సమయం గడుపుతాను అని పేర్కొన్నారని తెలిపారు..

భీమారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం మెట్ల నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని, మెట్ల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేయాలని పేర్కొన్నారు.. రానున్న రోజుల్లో రాజకీయాలకతీతంగా మన ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని తెలిపారు.

## వెంకట్రావు పేట గ్రామంలో ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128 వ జయంతి వేడుకలు



**షణ్ముఖ వెలుగు మేడిపల్లి మండలం ప్రతినిధి జనవరి 23:** స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయవాది, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు, భారత స్వాతంత్ర్య సాధనకు కొత్త రాజకీయ పంథాకు శ్రీకారం చుట్టిన నేతాజి సుభాస్ చంద్ర బోస్128వ జయంతి పురస్కరించుకొని జగిత్యాల జిల్లా భీమారం మండల వెంకట్రావు పేట గ్రామంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడతల వెంకటేష్, మునుగూరి వినోద్, బూస రాకేష్, ఎండి చాంద్ పాషా, బాబు గజ్జెల ,ఎర్ర సంజీవ్ రావు,గాజుల శ్రీనివాస్, బొజ్జ మహేష్, చిలివేరి గంగా రాజం, గోడిసెల రాజు,సుంకపాక ప్రభాకర్, సుదవేని నర్సయ్య,సుదవేని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

## అక్రమంగా మేడిపల్లి

# మండల బిజెపి నాయకుల అరెస్టులు






**షణ్ముఖ వెలుగు మేడిపల్లి మండలం ప్రతినిధి జనవరి 23:** మేడిపల్లి మండల కేంద్రంలోని పిఎన్ ఆర్ గార్డెన్స్ లో నిర్వహిస్తున్న గ్రామసభ కు వెళ్లి, లబ్ధిదారుల వివరాలు దరఖాస్తుదారుల వివరాలు తెలుసుకుందామని ప్రయత్నించిన బీజేపీ నాయకులను కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అక్రమంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ అక్రమ అరెస్టులకు నిరసనగా క్యాతం దశరథ రెడ్డి మాట్లడుతూ ఇప్పుడు రేషన్ కార్డుల కొరకు ఆత్మీయ భరోసా కొరకు అప్లికేషన్లు పెట్టుకోమని గ్రామసభలు నిర్వహిస్తున్నారు. గతంలో ప్రజాపాలన లో దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంతమంది లబ్ధిదారులకు లబ్ధి చేకూరింది ఎంతమంది తిరస్కరణకు గురైంది తెలుపాలని ఇలా ప్రతిసారి దరఖాస్తు చేసుకోమని కాలయాపన కార్యక్రమాలు కాకుండా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 420 హామీలు నెరవేర్చేందుకు కృషి చేయాలని రైతు రుణమాఫీ రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు ఆత్మీయ భరోసా వంటి హామీలను వెంటనే అమలు పరచాలని లేని పక్షంలో ఇలాగే ప్రజల పక్షాన ఎల్లప్పుడూ పోరాడుతామని తెలిపారు

## ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు





**షణ్ముఖ వెలుగు శ్రీరంగాపురం ప్రతినిధి జనవరి 23:** శ్రీరంగాపురం మండల కేంద్రంలో సుభాష్ చంద్రబోస్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు సొప్పరి వెంకటయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుభాష్ యువజన సంఘ సభ్యులు కృష్ణయ్య,మేకల రఘు,చుక్క నాగులు, ఆంజనేయులు ,ఈశ్వరయ్య, వెంకటయ్య, నరేష్ అలాగే ఆదర్శ విద్యాలయంలో కరస్పాండెంట్ జయకృష్ణన్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ మొట్ట మొదటి సారిగా భారత సైన్యాన్ని ఏర్పాటు చేసి భారతదేశానికి స్వాతంత్రం రావడంలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శరత్ కుమార్, ప్రభావతి,బీనా కృష్ణన్,రాధమ్మ,యాదమ్మ, పుష్పలత, సేచినా,అశ్విని విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**-వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్**



**షణ్ముఖ వెలుగు శ్రీరంగాపురం ప్రతినిధి జనవరి 23:** శ్రీరంగాపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొన్న వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ పేదల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్లు,రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్ కార్డుల లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియ నిరంతరం జరుగుతుందని,అర్హులైన వారు జాబితాలో పేరు లేకున్నా అధైర్య పడకుండా తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల తహసిల్దార్ మురళీధర్ గౌడ్, ఎంపీడీవో రవి నారాయణ డిడబ్ల్యూఒ స్పెషల్ ఆఫీసర్ సుధారాణి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములు యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ ఎవ్వరూ అధైర్య పడొద్దు

**-ఎమ్మెల్యే మేఘా రెడ్డి**



**షణ్ముఖ వెలుగు శ్రీరంగాపురం ప్రతినిధి జనవరి 23:** ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే మేఘా రెడ్డి శ్రీరంగాపురం మండలం శేరుపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజలకు కొండంత అండగా నిలుస్తాయని, ఎవ్వరూ అధైర్య పడకుండా పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ మురళీధర్ గౌడ్, మండల ఎంపీడీవో రవి నారాయణ,డిడబ్ల్యూఒ సుధారాణి, పెబ్బేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి లతో పాటు గ్రామ ప్రజలు,కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శారాజీ పేట పాఠశాలలో గణతంత్ర క్రీడలు



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి జనవరి 23:** గణతంత్ర దినోత్సవం జనవరి 26 ను పురస్కరించుకొని గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజీపేట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి జ్యోతి రాజు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభిస్తూ క్రీడలు మానసిక వికాసానికి శారీరక దృఢత్వానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ గడసంతల మధుసూదన్ ఉపాధ్యాయులు రాజేశ్వరరావు నసీరుద్దీన్ రాంచందర్ శ్రీనివాస్ కాంతారావు కృపాకర్ దయాకర్ సంగీత దివాకర్ ఎలేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరులో ఘనంగా నేతాజీ జయంతి



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి జనవరి 23:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణం ఆదర్శ నగర్ లో బిజెపి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ని పురస్కరించుకొని గురువారం నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షుడు నంద గంగేష్ మాట్లాడుతూ దేశంపై ప్రేమ మక్కువను పెంపొందిస్తూ దేశ అభివృద్ధిలో యువత పాలు పంచుకొని నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్డెమాన్ నరేందర్ జిల్లా నాయకులు బడుగు జాంగిర్ కామిటికారి కృష్ణ పులిపలుపుల మహేష్ కంతుల శంకర్ సీనియర్ నాయకులు చిలువేరు నరసింహారెడ్డి వడ్డెమాను కిషన్ కళ్లెం రాజు ఐలి సందీప్ బోడుపట్ల రాజశేఖర్ ఎగ్గిడి సంపత్ సుక్క రాజు ఎలగందుల రమేష్ పగడాల శ్రీనివాస్ బూత్ అధ్యక్షులు కటకం వెంకటేష్ ఎలగల వెంకటేష్ గుర్రం నరసింహులు పరమణి స్వామి మాక్సుద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## టిపిపిఆర్పిఏ ఆధ్వర్యంలో నేతాజీకి ఘన నివాళి



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి జనవరి 23** :నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకొని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టిపిపిఆర్పిఏ) ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు లో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మ కంటి బాలరాజు మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ బ్రిటిష్ వాళ్లకు వ్యతిరేకంగా స్వాతంత్రోద్యమంలో పాల్గొని ఎంతో ధైర్యసాహసాలతో పోరాడిన మహెూన్నత స్వాతంత్ర్య సంగ్రామ యోధుడు దేశభక్తి గల భారతీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు వీసం యాదగిరి పెన్షనర్లు దాసరి రామచంద్రయ్య అంజయ్య జి లక్ష్మీనారాయణ వెంకట్రామిరెడ్డి హరికృష్ణ మొరిగాడి కృష్ణ రాములు యాకూబ్ కాలనీ వాసులు మహేశ్ అంబటి జగన్ మహేష్ చిట్టోజు రాము ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సడక్ సురక్షా అభియాన్ జాగ్రత్త కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్






**షణ్ముఖ వెలుగు మేడిపల్లి మండలం ప్రతినిధి జనవరి 23:** వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ వద్ద తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ రహదారి భద్రత మహెూత్సవాలు 2025లో భాగంగా నిర్వహిస్తున్న సడక్ సురక్ష అభియాన్ జాగ్రత్త కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎఎస్పీ శేషాద్రిని రెడ్డి తో కలసి పాల్గొన్నారు అనంతరం ప్రభుత్వ విప్ తిప్పాపూర్ బస్టాండ్ నుండి రాజన్న ఆలయం వరకు స్వయంగా ఆటో నడిపి కోరుట్ల బస్టాండ్ వద్ద మానవహారం లో పాల్గొని రోడ్డు భద్రత ప్రమాణం చేశారు..

## తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న డాక్టర్ కావూరి శ్రీనివాస్ శర్మ



**షణ్ముఖ వెలుగు కాప్రా సర్కిల్ ప్రతినిధి జనవరి 23:** ప్రతిష్ఠాత్మక తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న డా.కావూరి శ్రీనివాస్ శర్మ సాహిత్య, పరిశోధన, సినీ,లఘు చిత్ర రంగాల్లో విశేష కృషిని సల్పి ఇప్పటి వరకు 30 గ్రంథాలను రచించి,తెలుగు సాహిత్యానికి అంతగా(అసలే) తెలియని ప్రాచీన తాళపత్ర గ్రంథాలను సేకరించి పరిష్కరిస్తున్న డా.కావూరి శ్రీనివాస్ శర్మ కు విజయవాడలో శ్రీ కౌత పూర్ణానంద కళా వేదిక లో అంతర్జాతీయ శ్రీశ్రీ కళా వేదిక ఛైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భం గా తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారం రావడం వల్ల మరింత భాధ్యత పెరిగిందని శర్మ తెలియ జేశారు, ఈ చిత్రంలో బోయి భీమన్న సాహిత్య నిధి చైర్ పర్సన్ బోయి హైమవతి అమ్మ,జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి కొల్లి రమావతి,ఈశ్వరి భూషణం,గరిమెళ్ళ రాజేంద్ర, కార్యక్రమ నిర్వాహకులు సిబ్బంది పాల్గొన్నారు

# రోడ్డు రోలర్ దొంగలను అరెస్టు చేసిన జీడిమెట్ల పోలీసులు







**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి జనవరి 23:** ఈనెల 20న సుభాష్ నగర్ లో రోడ్ రోలర్ తో రోడ్డు వర్క్ జరుగుతుండడంతో పని ముగించుకొని రాత్రి అక్కడే పార్క్ చేసి వెళ్లారు. తిరిగి 21 న ఉదయం వచ్చి చూసేసరికి రోడ్డు రోలర్ కనిపించకపోవడంతో జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న జీడిమెట్ల పోలీసులు సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు మొదలు పెట్టారు. జీడిమెట్ల సిఐ మరియు డిఐ ఆధ్వర్యంలో నిందితుల ముఠాని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు అఫ్రోజ్ అహ్మద్ గుల్బర్గా కు చెందిన వ్యక్తి మహమ్మద్ ఇబ్రహీం, సయ్యద్ ముస్తఫా వీరు ముగ్గురు కలిసి ఇబ్రహీం అనే వ్యక్తికి స్క్రాప్ షాపు నడుపుతుండేవాడు. అఫ్రోజ్ అహ్మద్ సయ్యద్ ముస్తఫా లకు డబ్బులు ఇచ్చి డీసీఎం, ట్రాలీ లను దొంగలించి వాటిని స్క్రాప్ గా మార్చి బయట రాష్ట్రాలకు అమ్మేవాడు. వీరికి సహాయం అందించే మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. షేక్ అన్వర్ డిసిఎం ఓనర్ కమ్ డ్రైవర్, రామ సత్యనారాయణ ఓనర్ కం డ్రైవర్. రోడ్డు పక్కన పార్క్ చేసిన రోడ్ రోలర్ ను ఒక డీసీఎం రెండు క్రేన్ల సహాయంతో డీసీఎం లో ఎక్కించుకొని దానిని జహీరాబాద్ లో స్క్రాప్ గా మలిచి అమ్ముకోవాలనే ఉద్దేశ్యంతో తీసుకెళ్లారు. తీసుకువెళ్లే దారిలో డీసీఎం చెడిపోవడం తో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ కు రెండు కిలోమీటర్ల దూరంలో పక్కన పెట్టి వెళ్లారు. సి సి ఫుటేజ్ ఆధారంతో రోడ్ రోలర్ ను రికవరీ చేసుకోవడం జరిగిందన్నారు. అనంతరం కేసులో నైపుణ్యత చూపెట్టిన క్రైమ్ టీం, జీడిమెట్ల సిఐ మల్లేశం, మరియు డిఐ లను అభినందించి ఏసీపీ సురేష్ చేతుల మీదుగా రివార్డులు అందుకున్నారు.

## మాఘ అమావాస్య జాతరకు ముస్తాబవుతున్న శ్రీ లక్ష్మీ కేశవ పెరుమాండ్ల ఆలయం







**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట ప్రతినిధి జనవరి 23:** ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ కేశవ పెరు మాండ్ల ఆలయం ఈ నెల 29 మాఘ అమావాస్య పర్వదినం సందర్భంగా నిర్వహించే జాతరకు ముస్తాబు అవుతుంది. ఆలయ ప్రాంతంలోని గుట్ట పై జరిగే జాతరకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తుందని నిర్వాహకులు తెలిపారు. గత నాలుగు వందల సంవత్సరాల చరిత్ర గల ఈ ఆలయాన్ని గత 8 సంవత్సరాలుగా దాతల సహకారంతో పునర్నిర్మాణం చేసి అభివృద్ధి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎల్లారెడ్డి పేట మండలం తో పాటు పరిసర మండలాల ప్రజలు భక్తులు మాఘ అమావాస్య రోజు నిర్వహించే స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. మాఘ అమావాస్య సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించడం పరిపాటి కాని ఎల్లారెడ్డి పేట లోని శ్రీ లక్ష్మీ కేశవ పెరుమాండ్ల స్వామి ఆలయంలోని స్వామి వారికి ఉదయం నుండి అభిషే కాలు అర్చనలు, కలశ పూజలు నిర్వహించడం ప్రత్యేకత అని ఆ రోజు అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్ల ను దర్శించి వారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని శ్రీ లక్ష్మీ కేశవ పెరుమాండ్ల ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పారిపెల్లి రామ్ రెడ్డి ,వైస్ చైర్మన్ ముత్యాల ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పందిర్ల లింగం గౌడ్ , కమిటీ సభ్యులు కోరారు.

## సాగు నీటి కాలువలు శిథిలావస్థలో ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని ఆందోళనలో అన్నదాతలు

**ప్రశ్నార్థకంగా రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకం లిఫ్టు-2 ఏనుకుంట రిజర్వాయర్ ఆయకట్టు సాగు కాలువలు**

- పూడి పోయిన పంట కాలువ నీళ్లు అందక రైతుల ఆందోళన
- కాలువల్లో నిండిపోయిన సిల్టు కంప చెట్లు పిచ్చిమొక్కలు
- నిర్వహణ మరిచిన నీటిపారుదల శాఖ అధికారులు
- చివరి ఆయకట్టు వరకు యాసంగి సాగుపై రైతులు అయోమయంలో
- ఎండాకాలంలో పంటలు ఎండిపోకుండా సాగునీటి కష్టాలను తీర్చాలి
- వేడుకుంటున్న అన్నదాతలు






**షణ్ముఖ వెలుగు,వనపర్తి జిల్లా ప్రతినిధి జనవరి 23:** పంటలు సమృద్ధిగా పండటంలో సాగునీటి కాలువలు కీలక భూమిక పోషిస్తాయి.అలాంటి సాగునీటి కాలువల నిర్వహణను గత పదేళ్లుగా ప్రభుత్వాలు పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. వనపర్తి జిల్లా మదనా పురం మండలం పరిధిలోని భారీ నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకం లిఫ్టు-2 ఏనుకుంట రిజర్వాయర్ పరిధిలోని సాగు నీటి కాలువలలో పూడికలు తీయకపోవడంతో పంటలకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**నీరందక రైతుల తీవ్ర ఇబ్బందులు**

సాగు నీటి కాలువల నిర్వహణ అధ్వానంగా తయారైందని రైతులు కోరుతున్నారు.పూడికలు తీయకపోవడంతో కంప చెట్లు,పిచ్చి మొక్కలు, పూడిక,జమ్మూ,ఇసుక దిబ్బలు సిల్టు విపరీతంగా పెరిగి కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలోని భారీ నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకం లిఫ్టు-2 ఏనుకుంట రిజర్వాయర్ పరిధిలో వడ్డేవాట గ్రామం,వడ్డేవాట తాండా,తీర్మాలయాపల్లి గ్రామం,అజ్జకొల్లు గ్రామం రిజర్వాయర్ పరిధిలో దాదాపు సుమారుగా 15 కిలోమీటర్లు కాలువ ఉండడంతో సాగునీరు పారేదేమో 4 కిలోమీటర్లు మాత్రమే శిస్తు బోర్లు బావులు కాలువలు సాగు కలిపి వేల ఎకరాలు పొలాలకు నీరందక నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. తీర్మాలయాపల్లి, అజ్జకొల్లు రైతులకు సాగునీరు అందడం లేదని,గత ప్రభుత్వం కాలువలను నిర్లక్ష్యం చేయడంతో పంటలకు నీరందక తీవ్ర ఇబ్బందులు పడ్డామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాసిరకమైన పనులు తో కాలువ నిధులు దండుకున్నారు.గత ప్రభుత్వ హయాంలో సాగునీటి కాలువలను బాగు చేయాలని కోరినా ఎవరూ పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. నేతల నిర్లక్ష్యం ఫలితంగా పొలాలకు నీరందక నష్టపోతున్నామని రైతులు ఆవేదన.నాణ్యమైన పనులు చేపట్టకపోవడం, తూతూ మంత్రంగా పనులు చేసి మమా అనిపించడంతో కాలువలు పూడిక తో నిండిపోయాయి. కాలువల్లో దట్టంగా కంప చెట్లు, జమ్ము,పూడిక పేరుకుపోయి సాగునీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది.సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్వహణ విషయంలో నీటిపారుదల శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి.




సాగునీటి కాలువల నిర్వహణను గాలికి వదిలేయడంతో రైతుల పొలాలు ప్రశ్నార్థకంగా బీడు భూములుగా మారాయి. సమయానికి ఈ ఏడాదైనా పూడి పోయిన కాలువను దేవరకద్ర స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు చొరవ చూపి పూడికతీత చేపట్టి ఎండాకాలంలో పంటలు ఎండిపోకుండా రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలని ఆయకట్టు రైతులు స్థానిక ఎమ్మెల్యే ను కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు




**షణ్ముఖ వెలుగు జగిత్యాల ప్రతినిధి జనవరి 23:** జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో పరాక్రమ దివస్, సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగిత్యాల జిల్లా చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ భూమేశ్, షి టీం కానిస్టేబుల్ సౌజన్య, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రమోద పాల్గొని సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రపై, వారి స్వాతంత్ర పోరాటం పై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన ఉపన్యాస పోటీలో ప్రథమ స్థానంలో సయ్యద్ ఫలక్,బి. అంజలి, వ్యాస రచన పోటీలో ప్రథమ బహుమతి హర్షిని, ద్వితీయ బహుమతి పి.అంజలి, తృతీయ బహుమతిని నివేదిత గెలుపొందారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం వాలంటరీ మారం గణేశ్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ సంగీత రాణి,శ్రీలత, అధ్యాపకులు నీరజ, సునీత, రామచంద్రం, వరప్రసాద్ పాల్గొన్నారు.

## భూమి లేని పేదలందరికీ
# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న**




**షణ్ముఖ వెలుగు డోర్నకల్ ప్రతినిధి జనవరి 23:** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్దిదారులకు ఖచ్చితంగా ఉపాధి జాబ్ కార్డు 20 రోజుల పని దినాలు ఉండాలనే నిబంధనలను తొలగించి భూమి లేని పేదలందరినీ అర్హులుగా గ్రామ సభలో ప్రకటించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనవరి 23 న గురువారం మరిపెడ మండలం తాళ్ల ఊకలు గ్రామంలో జరిగిన గ్రామ సభలో సంఘం ఆధ్వర్యంలో నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు,. అనంతరం రాజన్న మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకున్న ప్రజా పాలన దరఖాస్తులలో భూమి లేని వ్యవసాయ కార్మికులు ఎంత మంది ఉన్నారో బహిరంగ ప్రకటన చేయాలని కోరారు కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో భూమిలేని పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని గ్రామ సభల్లో నామ మాత్రపు లబ్ధిదారులను ప్రకటించే చర్యలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు, రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 52 లక్షల 78,000 జాబు కార్డు ఉండగా వాటిలో ఒక కోటి 11 లక్షల 31 వేల 234 మంది కూలీలు పని కోసం పేరు నమోదు చేసుకున్నారు వీరిలో ఒక సంవత్సరం 56 లక్షల 78, వేల 97 మంది కూలీలకు మాత్రమే పని కల్పించారు సగం మందికి పైగా పని చూప లేకపోయారని అన్నారు.

ఇప్పుడు ప్రభుత్వం ఉపాధి కార్డు పని దినాల ప్రాతిపదికగా తీసుకోవడం అంటే కూలీలకు అన్యాయం చేసే కుట్రగా రాజన్న మండిపడ్డారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల కాలంలో కొత్తగా ఒక్క జాబు కార్డు ఇవ్వలేదని పాత కార్డులో పిల్లల సంఖ్యను చేర్చలేదని కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి పని పేదలకు దూరం చేయుటకు జాబ్ కార్డు కు ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్ నెంబర్ లింక్ పేరుతో ఈ కాలంలో దేశ వ్యాప్తంగా ఏడు కోట్ల ఐదు లక్షల కార్డులను తొలగించి పేదలకు బిజెపి ప్రభుత్వం అన్యాయం చేసిందని వారన్నారు .ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పేదలను సమీకరించి ఆందోళన పోరాటాలకు పూనుకుంటామని హెచ్చరించారు,

ఈ నిరసన కార్యక్రమంలో సంఘం మండల నాయకులు గంధసిరి నగేష్ ,కొడగంటి సతీష్, కొత్త సైదులు, లబ్ధిదారులు ,మలికంటి వెంకన్న ,డాక్టర్ లింగన్న బాణాల ఎల్లయ్య, బాణాల లింగేష్ ,ఆకుల కిష్టయ్య శ్రీరాముల, రామన్న వెంకటమ్మ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

## ఓయూ చీఫ్ వార్డెన్ గా కొర్రెముల శ్రీనివాస్ విధులను ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారి



**షణ్ముఖ వెలుగు కాప్రా సర్కిల్ ప్రతినిధి జనవరి 23:** ఉస్మానియా యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ గా కొర్రెముల శ్రీనివాస్ ను విధులను పొడిగిస్తూ ఉత్తర్వులు అందజేస్తున్న ఓయూ వేసి ప్రొఫెసర్ కుమార్ ఈ పోస్టుకు వన్నె తెచ్చిన లౌక్యం తెలిసిన పాలకుడు విద్యార్థుల ఆత్మీయ నేస్తం విద్యార్థులకు ఏమైనా సమస్యలు వస్తే మూలాల్లోకి వెళ్లి పరిష్కరిస్తున్న అడ్మినిస్ట్రేటర్ కు మళ్ళీ ఒకసారి అవకాశం రావడం ఓయూ అనుబంధం కళాశాల అధ్యాపకులు విద్యార్థులు, హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు




**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి జనవరి 23:** ఎల్లారెడ్డి పేటలో శివాజీ చత్రపతి సేన ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో భాగంగా సుభాష్ చంద్ర బోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్దించుటకు ఆజాద్ హింద్ ఫౌజ్ అనే నినాదం తో సాయుధ పోరాటాన్ని చేసిన వీరుడు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అని వంగ గిరిధర్ రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో వంగ గిరిధర్ రెడ్డి, నేవూరి సురేందర్ రెడ్డి, మల్లారపు అమరేందర్ రెడ్డి, గంట వెంకటేష్ గౌడ్, నేవూరి శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎలగందుల నర్సింలు, పరికి స్వామి గౌడ్, పందిర్ల శ్రీనివాస్ గౌడ్, కొర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల ఆరోపణలు నిరాధారం

**కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వాటిని తిప్పికొట్టండి**
**నిజమైన లబ్దిదారులను గుర్తించడానికే గ్రామ సభలు**
**ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్**

**షణ్ముఖ వెలుగు డోర్నకల్ ప్రతినిధి, జనవరి 23:** ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్ అన్నారు. సంక్షేమ పథకాల సక్రమ అమలు కోసం నిజమైన అర్హులను ఎంపిక చేయడం ప్రధాన ఉద్దేశ్యం తో గ్రామ సభలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు, పది ఏండ్ల బిఆర్ఎస్ పాలనలో పేదవారికి అన్యాయం జరిగింది అలాంటి తప్పులు పునరావృతం కాకుండా తమ ప్రభుత్వం గ్రామ సభలో ప్రజల సమక్షంలో లబ్దిదారుల ఎంపిక చేయడం జరుగుతుందన్నారు, రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 4 పథకాలు ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు,రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి జరుగుతుందన్నారు, ఎవరికైనా అర్హత ఉండి రాని వారు ఉంటే గ్రామ పంచాయితీ కార్యదర్శికి దరఖాస్తు పెట్టుకోవాలన్నారు. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు అని వారు గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని వారు ఈ రోజు సన్నాయి నొక్కులు నొక్కుతూన్నారని దుయ్యబట్టారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 10 వేల రూపాయలను 12 వేలకు పెంచడమైనది దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుంది, ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ ఆరోగ్య శ్రీ 5-10 లక్షలకు పెంచామని 18 వేల కోట్లతో రైతులకు 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశారని,ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని సన్న వడ్ల కు 500 బోనస్ ఇచ్చామని ,గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమచేయడమైనదని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి ఇప్పటికే అమలు చేస్తున్న పథకాల మాదిరి ఈ నెలలోనే మరో నాలుగు



పథకాలు ప్రారంభం కానున్నాయని ప్రజలు ఎవరు అధైర్యపడవద్దని అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తిస్తాయని క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేషన్ కార్డుల,ఇందిరమ్మ ఇళ్ల పై జరుగుతున్న తప్పుడు సమాచారం పై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రతిపక్షాల ఆరోపణలు తిప్పికొట్టాలని సూచించారు.

## బూట్లు టై బెల్టు లు పంపిణీ చేసిన పూర్వ విద్యార్థి మాసూమ్




**షణ్ముఖ వెలుగు పెబ్బేరు ప్రతినిధి జనవరి 23:** యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మొత్తం 110 మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థి మాసుం సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వార్డెన్ పనిచేస్తు వారి తండ్రి మహమ్మద్ వలి జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు 110 షూ జతలు టై లు , బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు,బొల్లు హుస్సేన్ యాదవ్ మాట్లాడుతు యాపార్ల పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మాసుమ్ మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలోని విద్యార్థులు కూడా ప్రైవేట్ స్కూల్ కు ధీటుగా ఉండాలని అందుకే షూస్ టై, బెల్టులు పంపిణీ చేస్తున్నానన్నారు.

ఈ కార్యక్రమం లో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హుస్సేన్ రైతు సంఘం నాయకుడు స్వరాజ్యం బాబు రెడ్డి, వినోద్, ఉపాధ్యాయులు, వెంకటేశ్వర్లు మోహినొద్దీన్ ఈశ్వర్ రెడ్డి. శ్రీధర్.బాలమ్మ, ఇందిర,భాగ్యలక్ష్మి, రమేష్, ఆంజనేయులు, శివాని, అనూష, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతిని నిర్వహించిన కోరుట్ల బిజెపి పట్టణ శాఖ



**షణ్ముఖ వెలుగు కోరుట్ల టౌన్ ప్రతినిధి జనవరి 23:** భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ పట్టణంలోని స్థానిక నందిశ్వరాలయం (నంది చౌరస్తా) ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు .అనంతరం బిజెపి పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేష్ మాట్లాడుతూ స్వాతంత్ర సాధనలో సుభాష్ చంద్రబోస్ సేవలు మరువలేనివి అని ఆ మహోన్నత వ్యక్తి ఆశయాలు చాలా గొప్పవని అందుకే తను ఈ దేశానికి నేతాజీ అయ్యాడని కొనియాడారు, ఇట్టి కార్యక్రమంలో కోరుట్ల పట్టణ అధ్యక్షులు బింగి వెంకటేష్, ఓ బి సి రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి ఇందూరి తిరుమల వాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుదవేణి మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు ఇట్యాల నవీన్, చెట్లపల్లి సాగర్, కౌన్సిలర్ మాడవేణి నరేష్, మాజీ పట్టణ అధ్యక్షులు చిరుమల ధనుంజయ్, సీనియర్ నాయకులు ఇందూరి సత్యం,పోతుగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఒజ్జల నగేష్, ఎర్ర రాజేందర్, కంఠం ఉదయ్ యువ మోర్చా అధ్యక్షులు సాయి చంద్,రాగం శెట్టి సాయి, మేకల గణేష్, గడ్డం రాజశేఖర్, వేమూరి విజయ్,చిట్యాల రాజేందర్, దుర్గా ప్రసాద్, చింతకింది గోపాల్,గిన్నెల శ్రీకాంత్, ఎడమల పెల్లి సాయి, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్లాస్టిక్ వాడటం వలన
# కలిగే అనర్థాలు పై అవగాహన ర్యాలీ




**షణ్ముఖ వెలుగు కోరుట్ల టౌన్ ప్రతినిధి జనవరి 23:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో గురువారం లిటిల్ జీనియస్ హైస్కూల్ యాజమాన్యం స్టూడెంట్ లీడర్ మూమెంట్ కార్యక్రమంలో భాగంగా ప్రైమరీ మరియు హైస్కూల్ ఎన్ సి సి విద్యార్థిని విద్యార్థులచే ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలు పైన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ర్యాలీగా వెళ్లి గడి బూరుజు వద్ద గల కూరగాయల మార్కెట్ కు చేరుకొని అక్కడ ఉన్న కూరగాయల అమ్మకం దారులకు కొనుగోలుదారులకు ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలు గురించి వివరించారు. విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమాల ద్వారా కూరగాయలు అమ్మేవారు కొనేవారు ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలను అర్థం చేసుకొని సాధ్యమైనంతవరకు ప్లాస్టిక్ ను వాడకుండా ఉంటామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బండి మహాదేవ్, హైస్కూల్ ప్రిన్సిపల్ కలకుంట్ల రాధాకృష్ణ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కొత్త వినోద, ప్రీ ప్రైమరీ ప్రిన్సిపాల్ కటుకం సుధారాణి, డైరెక్టర్ కొత్త రాజు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ కు ఘన నివాళులు



**షణ్ముఖ వెలుగు శేరిలింగంపల్లి ప్రతినిధి జనవరి 23:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా దీన బంధు కాలనీ చౌరస్తాలో గురువారం ఏర్పాటు చేసిన నేతాజీ చిత్రపటానికి బీజేపీ నాయకులు , కార్యకర్తలతో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే,ఇంఛార్జి రవికుమార్ యాదవ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ను స్మరించుకుంటూ ఆయన జరిపిన సాయుధ పోరాటం ద్వారా భారతదేశాన్ని బ్రిటిష్ పాలన నుండి విముక్తి చెయ్యాలని తలచిన వారిలో సుభాష్ చంద్రబోస్ ప్రముఖులని తెలిపారు, అంతే కాకుండా నేతాజీ జన్మదినాన్ని పరాక్రమ దివస్ గా జరుపుకుంటారని తెలుపుతూ, ఆయన జాతీయ వాదం మరియు దేశభక్తికి ప్రతీక అని ఆయన చేసిన పనుల గురించి లేదా ఆయన మరణం గురించి చాలా విషయాలు మనం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వంశీ రెడ్డి, బాలు యాదవ్, రమేష్, బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, సీనియర్ నాయకులు పర్వతాలు యాదవ్, నర్సింగ్ యాదవ్, గోపాల్ రావు, భూపాల్ రెడ్డి, రాజి రెడ్డి, చారి, నర్సింగ్ రావు,నరేష్,భాస్కర్ రెడ్డి, మురళీ,శ్రీకాంత్ యాదవ్, విజయ్, కళ్యాణ్, లలితా రెడ్డి, మమత, కవిత, రేణుక, బంటీ, పవన్, మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాబితాలో పేరు లేని వారు ఆందోళన చెందవద్దు

**అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయి**
**అడ్డ గూడూరు ఎంపీడీవో శంకరయ్య**






**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి జనవరి 23:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతాయని అడ్డ గూడూరు ఎంపీడీవో శంకరయ్య అన్నారు. మండలంలోని కంచనపల్లి, లక్ష్మీదేవి కాల్వ, కోటమర్తి, కొండం పేట, అడ్డ గూడూరు గ్రామాల్లో ప్రజా పాలన గ్రామ సభలు నిర్వహించారు. అడ్డ గూడూరు మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో లబ్ధిదారుల జాబితాను ప్రజలకు చదివి వినిపించారు. జాబితాలో పేరు రాని వారు మా పేర్లు లిస్టులో ఎందుకు లేవని అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..అర్హత ఉండి జాబితాలో పేరు లేని వారు ఆందోళన చెందవద్దని అన్నారు. జాబితాలో పేరు లేని వారు సభలో ఏర్పాటు చేసిన కౌంటర్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 26 తారీకు లోపు అర్హులైన ప్రతి ఒక్కరూ ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రేమలత, రెవిన్యూ సీనియర్ అసిస్టెంట్ నగేష్, అడ్డ గూడూరు పంచాయతీ కార్యదర్శి నరేష్, ఏఈఓ దయాకర్ , ఫీల్డ్ అసిస్టెంట్ శివయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల సాగర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాలెంల సైదులు, ఆసర్ల బీరు మల్లు, గోలి రాంరెడ్డి, కందుకూరు అండాలు గుత్త వినోద గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## కానిపర్తిలో ప్రజా పాలన గ్రామ సభ రచ్చ రచ్చ



**షణ్ముఖ వెలుగు కమలా పూర్ మండల ప్రతినిధి జనవరి 23:** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్ర పరిధిలోని కానిపర్తి గ్రామంలో ప్రభుత్వ ప్రజా పాలన సభ రసాభాసగా మారింది. రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాను, అధికారులు చదవగానే గ్రామ సభలో గందరగోళం నెలకొంది. ఆ జాబితాలో అనరుల పేర్లే ఎక్కువగా ఉన్నాయని, అర్హులైన వారి పేర్లు లేవని, అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ప్రభుత్వ పథకాలన్నీ ఉన్న వారికే అధికారులు కట్టబెడుతున్నారని, నిరుపేదల పైన అధికారులు వివక్ష చూపుతున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి క్షేత్ర స్థాయిలో అర్హులైన వారిని గుర్తించి వారికి న్యాయం చేయాలని గ్రామ ప్రజలు కోరారు. ప్రభుత్వ రాజకీయ నాయకుల అండదండలతో అధికార పలుకుబడితో అధికారులపై ఒత్తిడి తెచ్చి అనర్హులైన వారు (డబ్బున్న వారు ) వారికి వచ్చేలా నిరుపేదల పథకాలను బలవంతంగా పొందుతున్నారని, మండిపడ్డారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద ప్రజలకు అండగా ఉండాలని వారు ఆకాంక్షించారు. కానిపర్తి గ్రామంలో అధికారులు చదివిన జాబితా సరి అయింది కాదని దానిని పునర్ పరిశీలించి పేదలకు అండగా ఉండాలని కోరారు..

## నిరుపయోగంగా మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్





**షణ్ముఖ వెలుగు క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రతినిధి జనవరి 23:** మంచిర్యాల జిల్లా కాతన పల్లి మున్సిపాలిటీ లోనీ తిమ్మాపూర్ ఆర్ ఆర్ నగర్ రోడ్ నెంబర్ 1 మరియు 2 లో నివసిస్తున్న ప్రజల దాహార్తి తీర్చేందుకు గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం మంచినీటి సరఫరా కొరకు ఆర్. ఆర్ కాలనీ వెనకాల తిమ్మాపూర్ శివారులో గత 3 సంవత్సరాల క్రితం ఓవర్ హెడ్ ట్యాంక్ ను నిర్మించారు. ఈ ట్యాంక్ నుండి ఇప్పటి వరకు పైపులైను బిగించకపోవడంతో త్రాగునీరు రాక కాలనీవాసులు ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. మున్సిపల్ అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా స్పందించకపోవడం విశేషం. ఈ ప్రభుత్వమైనా స్పందించి ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు చేపట్టి ఆర్ ఆర్ నగర్ కాలనీ వాసుల దాహార్తిని తీర్చాలని కాలని వాసులు కోరుకుంటున్నారు.

## కేతన పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9 వ వార్డు లో ప్రజా పాలన సభ లో పాల్గొన్న కలెక్టర్




**షణ్ముఖ వెలుగు కేతన పల్లి మున్సిపాలిటీ ప్రతినిధి జనవరి 23:** మంచిర్యాల జిల్లా మందమర్రి మండల కేతన పల్లి మున్సిపాలిటీ లోని 9వ వార్డు అమ్మ గార్డెన్ తిమ్మాపూర్ లోని రోడ్ నెంబర్ 30 లో ప్రజా పాలన సభ నిర్వహించారు .ఈ కార్యక్రమంలో భాగంగా కాతనపల్లి మున్సిపాలిటీలోని ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, రేషన్ కార్డు జాబితాను వెల్లడించారు, దీనిలో భాగంగా అర్హులైన ప్రజలందరికీ ఈ పథకాలు అందేలా చేస్తామని కలెక్టర్ తెలిపారు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కేతన పల్లి మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ పారుపల్లి తిరుపతి ఎమ్మార్వో సతీష్ మున్సిపల్ కమిషనర్ రాజు మున్సిపల్ సానిటరీ ఇన్ స్పెక్టర్ చంద్రయ్య మున్సిపల్ 9వ వార్డు ఆఫీసర్ ప్రియమాల ఏఈ కనకరాజు గోపతి బానేష్ , జక్కుల రాజయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి పట్టణంలో రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తుల స్వీకరణ



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి క్రైమ్ ప్రతినిధి జనవరి 23:** మెట్ పల్లి పట్టణ మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల దరఖాస్తు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగ్ రావు లబ్ధిదారుల సభలో పాల్గొన్ని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మకంగా నూతన రేషన్ కార్డులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇండ్లు కార్యక్రమం ప్రతి ఒక్కరికి అర్హులకు లబ్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ప్రజల వద్దనే సభ నిర్వహించడం జరుగుతుందని పట్టణ ప్రజలు కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు కొరకు దరఖాస్తు చేసుకోనేందుకు అవకాశం కలదు కావున ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం కౌన్సిలర్ లు యామ రాజయ్య మానస కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్ ఆడెపు రమణ ,ముఖిమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు .

## స్నేహ ఫౌండేషన్


# వ్యవస్థాపకులు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు





**షణ్ముఖ వెలుగు కమలాపూర్ ప్రతినిధి జనవరి 23:** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని కానిపర్తి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి, విద్యార్థినులు, కలిసి స్నేహ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తన కూతురు స్వర్ణలతారెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేయించి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు ఫ్యాన్లు, నీటి సదుపాయం, పిల్లలకి బుక్స్ పెన్స్ కూడా అలాగే విద్యార్థులకు ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. సుదూర ప్రాంతాల్లో ఉంటూ కూడా విద్యార్థుల బాగోగులు అడిగి తెలుసుకుంటూ వారికి అవసరమైనవి సకాలంలో అందించడం ఆయన సేవా భావానికి నిదర్శనమని అన్నారు. గత 12 ఏళ్ల క్రితం స్నేహ ఫౌండేషన్ స్థాపించి గ్రామంలో పేదవారికి అండగా ఉంటూ విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న శ్రీనివాస్ రెడ్డి మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆ భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. శ్రీనివాస్ రెడ్డి మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని, అన్నారు. శ్రీనివాస్ రెడ్డి అతని కుటుంబ సభ్యులను దేవుడు చల్లగా చూడాలని కోరుకుంటున్నానని అన్నారు. విద్యార్థులు శ్రీనివాస్ రెడ్డి సేవలను గుర్తు చేసుకుంటూ సంతోషంతో చాక్లెట్లు మరియు బిస్కెట్లు కేకులు అందరికీ పంచి ఆనందం వ్యక్తం చేస్తూ పండుగలా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు కోడిగుడ్డు చేరాలు, ఇసంపల్లి కొమురయ్య, ఇసంపల్లి సురేందర్, మరియు ఇసంపల్లి రాజు, ఇసంపల్లి రవీందర్, ఇసంపల్లి ముండయ్య, కత్తెర్ల శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు రాష్ట్రాల మధ్య మళ్లీ జగడం



**ఢిల్లీ:** తెలుగు రాష్ట్రాల మధ్య నదీజలాల పంపిణీపై వివాదాలు తలెత్తుతూనే ఉన్నాయి. ప్రధానంగా కృష్ణా నది జలాల వాటాపై ఇబ్బందులు ఎక్కువగానే ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కేంద్రం పెద్దన్న పాత్రను పోషిస్తోంది. అయితే జల జగడంపై మరోసారి సుప్రీంకోర్టు తలుపును ఏపీ ప్రభుత్వం తట్టింది. కృష్ణా ట్రిబ్యునల్‌పై సుప్రీంకోర్టులో ఫిబ్రవరి 13న విచారణ జరగనుంది. కృష్ణా ట్రైబ్యునల్ నీటి పంపకాల వ్యవహారంపై సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం మెన్షన్ చేసింది. ట్రైబ్యునల్ ముందు దాఖలైన రెండు రిఫరెన్స్‌ల విచారణ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఏపీ ప్రభుత్వం ఆశ్రయించింది. 2023 అక్టోబర్ 23వ తేదీన విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌పై బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది.

విభజన చట్టం ప్రకారం నీటి వాటాల పంపకంపై రెండు రిఫరెన్స్‌లను ట్రైబ్యునల్‌లో రెండు తెలుగు రాష్ట్రాలు దాఖలు చేశాయి. మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ మధ్య నీటి పంపకాలు చేస్తూ... ఇప్పటికే బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ తీర్పు వెలువరించింది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత తలెత్తిన కృష్ణా నదీ నీటి పంపకాలపై ట్రైబ్యునల్‌ను తెలంగాణ ప్రభుత్వం ఆశ్రయించింది. కృష్ణానది తమ భూభాగంలోనే ఎక్కువ ప్రవహిస్తుంది కాబట్టి... రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తమకు 70 శాతం నీటి వాటా ఉండాలని... లేనిపక్షంలో రెండు రాష్ట్రాలకు 50 శాతం చొప్పున నీటిని పంపిణీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ వ్యవహారంపై ట్రైబ్యునల్ తేల్చక ముందే... 2023 అక్టోబర్ 10న కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణ మధ్యనే నీటి పంపకాలను తేల్చాలని, దానిపైనే విచారణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ... సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్‌ను దాఖలు చేసింది. తమ ముందు ఉన్న రెండు రిఫరెన్స్‌లలో... 2023లో కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ రిఫరెన్స్ పైనే ముందుగా విచారణ చేపడుతామని ఈనెల 16న కృష్ణా ట్రైబ్యునల్ తేల్చి చెప్పింది. ట్రైబ్యునల్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం ప్రస్తావించింది. ఫిబ్రవరి 19న ట్రైబ్యునల్ రెండు రిఫరెన్స్‌లనే విచారణకు తీసుకుంటామని చెప్పిన విషయాన్నిసుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లింది. తమ పిటిషన్‌పై త్వరగా విచారణ చేపట్టాలని ఏపీ న్యాయవాదులు కోరారు. ఏపీ ప్రభుత్వం ప్రస్తావనను పరిగణనలోకి జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌ల ధర్మాసనం తీసుకుంది. ఫిబ్రవరి 13న మధ్యాహ్నం 2గంటలకు తదుపరి విచారణను చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది

# రాజీ లేని నేతాజీ



**న్యూఢిల్లీ :** తాజీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పరాక్రమ్ దివస్ నిర్వహిస్తున్నారు. సుభాస్ చంద్రబోస్ జయంతి సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఆయనకు నివాళులర్పించారు. అభివృద్ధి చెందిన భారతదేశం కోసం ప్రజలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశాన్ని బలహీనపరిచేందుకు, ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్న శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. సుభాష్ చంద్రబోస్ జయంతిని దేశవ్యాప్తంగా పరాక్రమ్ దివస్‌గా కూడా పిలుస్తారు. భారతదేశ స్వాతంత్ర్యానికి ముఖ్యమైన కృషి చేసిన సుభాష్ చంద్రబోస్ జీవితం, వారసత్వం వేడుకగా దీనిని జరుపు కుంటారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా, దేశం మొత్తం ఆయనను గౌరవప్రదంగా స్మరించుకుంటుంది. నేతాజీకి గౌరవపూర్వకంగా నివాళులర్పిస్తున్నానని ప్రధాని మోదీ అన్నారు. నేతాజీని స్మరించుకుంటూ ప్రధాన మంత్రి, "ఆయన ఎప్పుడూ సుఖవంతమైన జీవితంలో చిక్కుకోలేదు. అదేవిధంగా, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడానికి మనమందరం మన సౌకర్యాల నుండి బయటపడాలి. ప్రపంచ స్థాయిలో మనల్ని మనం అత్యుత్తమంగా తీర్చిదిద్దు కోవాలి. దేశప్రజలు శ్రేష్ఠతను ఎన్నుకోవాలి. పాండిత్యంపై దృష్టి పెట్టాలి. దేశంలోని స్వరాజ్య సాధన కోసం బోస్ పూర్తిగా దృష్టి కేంద్రీకరించారని, ఇందుకోసం వివిధ వర్గాల ప్రజలు ఆయనతో ఐక్యమయ్యారని చెప్పారు. ఇప్పుడు మనం అభివృద్ధి చెందిన భారతదేశం కోసం ఐక్యంగా ఉండాలని ప్రధాని మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. భారతదేశ ఐక్యత కోసం ప్రజలు బోస్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని నరేంద్ర మోదీ అన్నారు. దేశాన్ని నిర్వీర్యం చేసి ఐక్యతను విచ్ఛిన్నం చేయాలనుకునే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. తొలిసారిగా త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన నేల అండమాన్. ఇక్కడే తొలిసారి నేతాజీ త్రివర్ణ పతాకం ఎగరేశారని తెలిపారు ప్రధాని మోదీ. ఇవాళ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా..పరాక్రమ్ దివస్‌గా జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా అండమాన్ దీవులకు బోస్ పేరు పెట్టడం, ఇండియా గేట్ వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, ఆయన జయంతిని 'పరాక్రమ్ దివస్'గా జరుపుకోవడం తదితర కార్యక్రమాలను ఆయన ప్రభుత్వ హయాంలో ప్రధాని ప్రస్తావించారు. భారతదేశ వారసత్వం గురించి బోస్ గర్వపడుతున్నారని ఆయన అన్నారు.నేతాజీ జయంతి సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో వివిధ పాఠశాలలకు చెంది విద్యార్థులతో ప్రధాని మోదీ ముచ్చటించారు. నేతాజీ గొప్పతనం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ నేతాజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఓల్డ్ పార్లమెంట్ హౌస్ సెంట్రల్ హాల్‌లో వివిధ పాఠశాల విద్యార్థులతో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమై దేశ భవిష్యత్తు గురించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రధాని మోదీ విద్యార్థులతో సమావేశమైన 3.27 నిమిషాల వీడియోను కూడా పంచుకున్నారు.ఈ సందర్భంగా, 2047 నాటికి మీ లక్ష్యం ఏమిటని ప్రధాని మోదీ విద్యార్థులను అడిగారు. దానిపై పిల్లలు దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని చెప్పారు. 2047 నాటికి మా తరం పూర్తిగా సిద్ధమవుతుందని పిల్లలు చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతా యన్నారు. అక్కడికి వచ్చిన విద్యార్థినులతో సంభాషిస్తున్న సందర్భంగా ప్రధాని మోదీ ఉదయం వారు ఇంటి నుంచి ఎన్ని గంటలకు బయలుదేరి ఇక్కడికి వచ్చారని అడిగారు. లంచ్ బాక్స్ తీసుకురాలేదా అని, కార్యక్రమం తర్వాత భోజనం ఎలాగా అంటూ ప్రధాని మోదీ నవ్వుతూ పలకరించారు.ఈ రోజు ఎందుకు ప్రత్యేకమైన రోజు అని బాలికలను ప్రధాని మోదీ ప్రశ్నించారు. ఆయన ఎక్కడ జన్మించారని ప్రధాని ఆరా తీశారు. నేతాజీ ఒడిశాలోని కటక్‌లో పుట్టారని విద్యార్థినులు తెలిపారు. ఒడిశాలోని కటక్‌లో ఓ పెద్ద ఫంక్షన్ జరుగుతోందని మోదీ స్వయంగా చెప్పారు. "తుమ్ ముఝే ఖూన్ దో, మైన్ తుమ్హే ఆజాదీ దూంగా!" "నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వేచ్ఛ ఇస్తాను" అనే బోస్ నినాదం గురించి ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్యోదయ యోజన గురించి విద్యార్థులకు వివరించారు.నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని 2021లో ప్రతి సంవత్సరం జనవరి 23న శౌర్య దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రకటించింది.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com